క్లుప్తంగా

దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



భీమవరంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలోని దివ్యాంగుల కుటుంబాలకు బుధవారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు అల్లు రామకృష్ణ మాట్లాడుతూ భీమవరం పట్టణానికి చెందిన దినేష్‌జైన్ భీమవరం పరిసర ప్రాంతాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే గాక ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యాభివృద్ధికి సహాయం అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, పుట్ల సురేష్, చింతాడ నాగలక్ష్మి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం



వీరవాసరం ఎంపీడీఓ కార్యాలయంలో యోగా చేస్తున్న దృశ్యం

వీరవాసరం: యోగాతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ప్రత్యేక యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. యోగ ద్వారా మానవాళి జీవిత పరమార్థం తెలుస్తోందన్నారు. శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఏర్పడుతుందన్నారు. యోగ శిక్షణతో పాటు సూర్య నమస్కారాలను చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, ఇన్‌చార్జ్ ఎంపిడిఓ అప్పారావు, గ్రామ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, యోగ శిక్షకులు పాల్గొన్నారు.


మల్లీశ్వరికి సత్కారం



డాక్టర్ మల్లీశ్వరిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ మెంబర్‌గా భీమవరంకు చెందిన డాక్టర్ చుండూరు మల్లీశ్వరి పదవీ బాధ్యతలు చేపట్టడం గొప్ప విశేషమని ది భీమవరం గైనకాలజీ సొసైటీ అధ్యక్షుడు డా సుంకర నరసవాణి, డాక్టర్ యిర్రింకి లక్ష్మి అన్నారు. భీమవరం స్పైస్ మ్యాజిక్ హాల్లో ది భీమవరం గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ నరసవాణి, డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని, మల్లీశ్వరి ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ మెంబర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టడం మన జిల్లాకే గర్వకారణమని అన్నారు. అనంతరం డా.మల్లీశ్వరిని సత్కరించారు. కార్యక్రమంలో డా రమ్య, సీనియర్ స్త్రీల వైద్య నిపుణులు డా సుభాషిణి, డా జయకుమారి, ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డా జె రామలక్ష్మి, డా స్వరాజ్య లక్ష్మి, డా మేళం జగదీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ రామరాజుకు సత్కారం



భీమవరంలో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ రామరాజును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ గుంటూరి రామరాజు ఎన్టీఆర్ స్మారక పురస్కారం అందుకున్న సందర్భంగా బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ అనేక రంగాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేసి బహుముఖ ప్రతిభ కనబరిచినందుకు ఎన్టీఆర్ స్మారక పురస్కారం అందించారన్నారు. తన సంపాదనలో 10 శాతం సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నానని కాలేజీలో బెస్ట్ ఎన్‌సీసీ అవార్డు కూడా సాధించానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్యాబినెట్ సెక్రటరీ గాదిరాజు కృష్ణంరాజు, ట్రెజరర్ పాకలపాటి సీతారామరాజు, ఎస్ఎస్ఎన్‌రాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, జి అప్పలరాజు, ఎ యు భాస్కరరావు, కె చంద్రరావు, కె పాండురంగరాజు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెను ప్రమాదం

పాలకొల్లు సెంట్రల్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి పెను ప్రమాదమని కళా నైపుణ్యం ద్వారా కళాజాత కళాకారులు ప్రశాంత్ కుమార్ బృందం ప్రచారం చేసింది. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నేపథ్యంలో వివిధ సెంటర్లలో ప్రజలకు అవగాహన కల్పించారు.

వెన్నుపోటుపై మండిపాటు

- వైఎస్సార్‌సీపీ 'వెన్నుపోటు దినం' పిలుపునకు భారీ స్పందన
- ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేత
- హామీల అమలు ఎప్పుడు? అంటూ పెద్ద ఎత్తున నినాదాలు

భీమవరం: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ విధానాలకు నిరసనగా బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా సుమారు కిలో మీటరు దూరం పాదయాత్రగా ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ విధానాలను దుమ్మెత్తి పోస్తు నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు భీమవరం నియోజకవర్గంలోని పట్టణం, వీరవాసరం, భీమవరం మండలాల పార్టీ శ్రేణులతో పాటు ప్రభుత్వ పాలన పట్ల విసుగు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రకాశం చౌక్ సెంటర్‌కు చేరుకున్న పార్టీ నాయకులు, శ్రేణులు పార్టీ జెండాలు చేతబట్టి, పార్టీ కండువాలు మెడలో వేసుకుని కథం తొక్కారు. అక్కడి నుంచి వెంకట్రామ థియేటర్, తాలూకా ఆఫీసు సెంటర్, త్యాగరాజభవనానికి వెళ్లే రోడ్డు మీదుగా మునిసిపల్ కార్యాలయంలోని ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఏవో లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడారు. పార్టీ జిల్లా అధికారప్రతినిధి కామన నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ మద్యం విధానాన్ని విమర్శించిన కూటమి నాయకులు నేడు మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మహిళా అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నా హోంమంత్రి పట్టించుకోవడలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు నిత్యం జగన్‌ను విమర్శించడమే ధ్యేయంగా పనిచేస్తున్నారే తప్ప ప్రజల కష్ట, నష్టాలను పట్టించుకోవడం లేదన్నారు. భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు మాట్లాడుతూ లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మాయ మాటలు చెప్పి ప్రజల్ని మోసం చేశారన్నారు. ఏడాది కాలంగా హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో తిరుబాటు ప్రారంభమైందన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తే నేటి కూటమి ప్రభుత్వానికి అమరావతి నిర్మాణం తప్ప ప్రజల కష్టాలు కనబడడం లేదన్నారు. వైఎస్సార్ సేవాదళ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యతిరేకతకు ఈనాటి వెన్నుపోటు దినం విజయవంతం కావడమే నిదర్శనమన్నారు. కూటమి నాయకులు ప్రజలకిచ్చిన హామీలను నెర్పవేర్చేవరకు వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తూనే ఉంటుందని, ప్రజలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నుపోటు దినం ప్రోగ్రామ్ జిల్లా కన్వీనర్ నౌడు వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, నాయకులు చిరుగుపాటి సందీప్, గాదిరాజు రామరాజు, చవాకుల సత్యనారాయణ, జల్లా కొండయ్య, పేరిచర్ల సత్యనారాయణరాజు, కోడే యుగంధర్, ఇంటి సత్యనారాయణ, పాలవెల్లి మంగ, చికిలే మంగతాయారు, గంటా సుందరకుమార్, బదుగు అశోక్ కుమార్, పెనుమాల నర్సింహస్వామి, బలే ఏసుబాబు, బోకూరి విజయరాజు తదితరులు పాల్గొన్నారు.



భీమవరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్ తదితరులు



భీమవరంలో వెన్నుపోటు దినం సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



వీరవాసరం నుంచి వెన్నుపోటు దినం కార్యక్రమానికి వెళ్తున్న నాయకులు



పాలకోడేరు నుంచి భీమవరం వెళ్తున్న నాయకులు

భీమవరానికి తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

పాలకోడేరు: ఏడాది కాలంగా వంచన పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైఎస్సార్ సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతమైంది. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. పాలకోడేరు నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భీమవరం కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు చెల్లబోయిన పాపారావు, చేకూరి నరేంద్రరాజు, గుండు నాగేశ్వరరావు, బొక్కా రాంబాబు, పెన్మత్స వెంకటరాజు(బాబు), జాలే సునీత , కె.ప్రవీణ్ రాజు, గెద్దం జోషి, తమ్మిశెట్టి అబ్బులు, కోడూరి నాగేశ్వరరావు, గుంటపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం నుంచి..

వీరవాసరం: ఏడాది పాలనలో చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం భీమవరంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి వీరవాసరం మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నందమూరు గరువు ఆంజనేయస్వామి గుడి దగ్గర నుంచి మోటర్ బైక్లు, కార్లపై పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు చవాకుల సత్యనారాయణమూర్తి, మాజీ మండల అధ్యక్షుడు నేతల జ్ఞాన సుందరరాజు, గూడూరి ఓంకారం, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు , డివిడి ప్రసాద్, చికిలే మంగతాయారు, వీరవల్లి శ్రీనివాస్, కాటన్ స్టాండ్లీ రాజు, వీరవల్లి ప్రవీణ్, ముద్రగళ్ల యేసురాజు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వెన్నుపోటు బాబుకు వెన్నతో పెట్టిన విద్య

ఆకివీడు: చంద్రబాబు రాజకీయ జీవితంలో వెన్నుపోట్లు ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ అబ్జర్వర్ ముదునూరి మురళీ కృష్ణంరాజు, పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరు ఉమాబాల ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినాన్ని నియోజకవర్గ కేంద్రమైన ఉండిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన 147 హామీలను అమలు చేయలేదన్నారు. అన్నదాత వెన్ను విరిచారని ఆరోపించారు. తల్లికి వందనం చేయలేకపోతున్నారని విమర్శించారు. చంద్రబాబు మొదటి సంతకానికే దిక్కూమొక్కూ లేకుండా పోయిందన్నారు. ఏడాది గడిచినా డీఎస్సీ ఒక కొలిక్కి రాకుండా పలు నిబంధనలతో గందరగోళం చేశారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఓట్ల కోసం కాకుండా ప్రజల సంక్షేమం, పేదల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు అమలుజేశారన్నారు. రైతులు, మహిళలు, అందరి జీవన ప్రమాణాలు మెరుగుకు జగన్ కృషి చేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి ఏడాది గడిచినా మహిళా బస్సులు కనిపించడం లేదన్నారు. మహిళలకు చేయూత పథకం లేకుండా చంద్రబాబు చేశారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం పోరాడుతూనే జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని ఉమాబాల అన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాతపాటి వెంకట శ్రీనివాస రాజు(వాసు) మాట్లాడుతూ వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతమైందంటే చంద్రబాబు ప్రభుత్వ పాలన ఎంత అధ్వానంగా ఉందో? స్పష్టమవుతోందన్నారు. ఏడాది పాలనపై ప్రజలు విసుగుచెందిపోయారన్నారు. రోడ్డు ఎక్కితే రెడ్ బుక్కు ఓపెన్ చేసి చిత్రహింసలకు గురి చేస్తారనే భయంతో ప్రజలు గొంతు విప్పలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఆకివీడు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), రణస్థల కనకదుర్గ మహంకాళి, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, మంతెన సునీల్‌రాజు,అంబటి రమేష్, నంద్యాల సీతారామయ్య, పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, పెన్మెత్స ప్రసాదరాజు, సాగిరాజు హరివర్మ, కఠారి లక్ష్మీపతిరాజు, గుండాబత్తుల సుబ్బారావు, బదుగు బాలాజీ, గులిపల్లి అచ్చారావు, కరిమెరక రామచంద్రరావు, బందెల ప్రమీల, కొరపాటి అనిత, దొరబాబు, పళ్ళెం అరుణకుమారి, జి.సుందరకుమార్, ఎస్కే హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఉండిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అబ్జర్వర్ ముదునూరి మురళీకృష్ణంరాజు, ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, పాతపాటి శ్రీనివాసరాజు

విద్యాగణపతి ఆలయంలో మహా కుంభాభిషేకం



కలశ ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): గునుపూడిలోని విద్యాగణపతి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఉమా సోమేశ్వర గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో 108 మంది మహిళా భక్తులు కలశలతో పట్టణ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కలశ ఊరేగింపును ప్రారంభించారు. ముందుగా విద్యా గణపతిని దర్శించుకొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు హనుమ కిరణ్, అయ్యప్ప, వారణాసి పోలీస్, చెరుకుపల్లి సంతోష్, బ్రహ్మజ్యోసుల ప్రసాద్, వేలూరి సుబ్రహ్మణ్యం, మహిళ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కె.రాజరాజేశ్వరి

ఆకివీడు: కనిపించే ప్రత్యక్ష దైవం అమ్మ అని విద్యార్థులు తల్లిదండ్రులు చూపిన బాటలో నడుచుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కాకర్ల రాజరాజేశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి సెలవులు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మే ప్రథమ గురువు, దైవం అన్నారు. విద్యార్థులు అమ్మ చెప్పిన మాటలను విని, శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఉదయం 4,5 గంటలకే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో రీడర్స్‌ఫోరం అధ్యక్షుడు డి.సత్యనారాయణ, కిషోర్, నెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై అవగాహనా ర్యాలీ

నరసాపురం: పట్టణంలోని గ్రేడ్-1శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం పుస్తకాలు చదవాలి-విజ్ఞానం పెంపొందించుకోవాలి అనే నినాదంతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకూ ర్యాలీ సాగింది. పుస్తకాలు చదవడం , గ్రంథాయాలల్లో గడపడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీ చేశారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

యలమంచిలి: పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పోడూరు మండలం మట్టపర్రు గ్రామంలో బి.రాజు అనే వ్యక్తి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడనే సమాచారంపై బుధవారం దాడి చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. అతని వద్ద 6 మద్యం సీసాల స్వాధీనం చేసుకని అరెస్టు చేశామని వివరించారు.

ఎండుగడ్డి కొరతతో ఇబ్బందులు



ఇతర ప్రాంతాల నుంచి ఎండు గడ్డిని తరలిస్తున్న దృశ్యం (ఫైల్)



పాలకోడేరులో యంత్రాల ద్వారా వరి కోతలు కోస్తున్న దృశ్యం (ఫైల్)

- యంత్రాలతో వరి కోతలు..పనికిరాని గడ్డి
- భారమైన పశుపోషణ

పాలకోడేరు: ఎండాకాలం వచ్చిందంటే పచ్చ గడ్డి మచ్చుకైనా కనిపించదు. వేసవిలో పశు పోషణ అంతా ఎండు గడ్డి పైనే ఆధారపడి ఉంటుంది. గతంలో ఎండు గడ్డికి లోటు ఉండేది కాదు కానీ కొన్నేళ్లుగా వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో ఎండు గడ్డికి తీవ్ర కొరత ఏర్పడుతుంది. దీంతో మూగ జీవులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిని అధిగమించే దిశగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు. ఫలితం గా పాడి పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. నియోజకవర్గంలో కాళ్ల, పాలకోడేరు, ఆకివీడు ఉండి మండలాలు ఉన్నాయి. ఉండి మండలంలో పాడి ఆవులు, గేదెలు గొర్రెలు, మేకలు కలిపి 9,533, పాలకోడేరు మండలంలో మొత్తం అన్ని కలిపి 7057, కాళ్ల మండలంలో 13,970, ఆకివీడు మండలంలో సుమారు పది వేల వరకు ఉంటాయి.

కూలీల ఖర్చుల దెబ్బకు

గత కొన్నేళ్లుగా కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు యంత్రాలతో వరి కోతలపై మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు వాతావరణంలో తరచుగా వస్తున్న మార్పులతో పంటను హడావుడి గా ఒబ్బిడి చేసుకునేందుకు యంత్రాలతో కోతలకే రైతులు సిద్ధపడుతున్నారు. కూలీలతో పోలిస్తే యంత్రాలతో కోతల వల్ల ఖర్చు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతోంది. అయితే కూలీలతో కోతలు కోయిస్తే పశువులకు అవసరమైన ఎండు గడ్డిపెద్ద మొత్తంలో లభిస్తుంది. అదే యంత్రాలతో కోతలు కోయిస్తే పొలాల్లో నాణ్యమైన ఎండు గడ్డి రావడం లేదు. యంత్రాలతో కోతలతో వరి దుబ్బులో సగానికి పైగా నేల మీదే ఉండిపోతోంది. మిగిలిన సగం యంత్రం లో నలిగిపోయి పశువులు తినడానికి లేకుండా పోతోంది. అక్కడక్కడ యంత్రాలతో కోసిన గడ్డి ని పశువులు తినడం లేదని రైతులు చెబుతున్నారు

అకాల వర్షాలతో ఇబ్బంది రెట్టింపు

యంత్రాలతో వచ్చే గడ్డిని అరకొరగా పశువులు తినడంతో వాటిని ప్రత్యేక యంత్రం ద్వారా కట్టలు కట్టించి వాటినే రైతులు ఒబ్బిడి చేస్తున్నారు. అయితే ఇటీవల అకాల వర్షాలకు చాలా చోట్ల గడ్డి కట్టలు కట్టేందుకు పని రాకుండా పోయింది. చేలల్లోనే కుళ్లిపోయింది. ఈ దెబ్బతో ఈ ఏడాది పశుగ్రాసానికి ఇబ్బందులు తప్పవని రైతులు వాపోతున్నారు.

పశుగ్రాస పథకాలు దూరం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కనిష్టంగా 25సెంట్లు గరిష్టంగా 2.5ఎకరాలు కలిగి ఉన్న రైతులకు పశుగ్రాసం పెంపకానికి చేయూత నిచ్చేవారు. సైలేజ్ గడ్డి టీఎంఆర్ దాణా పశుగ్రాసం పెంచడానికి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీ పై అందించేవారు. దీంతో వేసవిలో పశుగ్రాసానికి కొరత లేకుండా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశుగ్రాసం పథకాలను పక్కన పెట్టేశారు. దీంతో ఈ ఏడాది రబీ కోతలు మొదలైన తొలి దశలోనే పశుగ్రాసం కొరత రైతులను వెంటాడుతుంది.

పెరిగిన ధరలు

కేవలం కూలీలతో కోతలు కోసిన గడ్డి మాత్రమే పశువులకు పనికి వస్తుండడం అది అతి తక్కువగా మాత్రమే అందుబాటులో ఉండడంతో గడ్డి ధరలు భారీగా పెరిగాయి. ట్రాక్టర్ ఎండుగడ్డి ధర రూ14 వేల నుంచి రూ.16 వేలకు పలుకుతోంది. ఉండి భీమవరం నియోజకవర్గాల నుంచి వేరే ప్రాంతాలకి వెళ్లి నేరుగా పొలాల్లోనే వరిగడ్డి ని కొనుగోలు చేసి ట్రాక్టర్‌లతో తరలించడంతో స్థానికంగా గడ్డి బాగా డిమాండ్ పెరిగింది.

> **గతంలో అమ్మేవాళ్లం.. ఇప్పుడు కొంటున్నాం**
>
> 
>
> యంత్రాలు వచ్చాక పశుగ్రాసానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గతంలో కోతలు కోసి కుప్పలుగా వేసే వాళ్లం. దీంతో పశుగ్రాసానికి ఇబ్బందులు ఉండేవి కాదు. చాలా గడ్డి అందుబాటులో ఉండేది. ఇతర ప్రాంతాల వాళ్ళు ఇక్కడకు వచ్చి ఎండుగడ్డి కొనుక్కొనేవారు కానీ ఇప్పుడు మా సొంత గేదెలకే గడ్డి లేకుండా పోయింది. ఇతర ప్రాంతాల నుంచి గడ్డి కొనుక్కురావాల్సిన పరిస్థితి ఎదురయ్యాయి.
>
> – కేతల సత్యనారాయణ, రైతు కోరుకొల్లు